# వ్యాఘ్రం



న్యాయపతి రాజగోపాలం

శ్రీరామచంద్రమూర్తి అన్నది అతడి పూర్తి పేరని చాలా తక్కువ మందికి తెలుసును. అతడినిఅందరూ మూర్తి అనే పిలుస్తారు. కొందరు "ఒరేమూర్తీ" అంటారు., కొందరు "మూర్తీ" అంటారు., మిగతావాళ్లు "మూర్తిగారూ", అంతేతేడా. మొత్తంమీద కాలేజీలో మూర్తిని ఎరగని విద్యార్థి లేడు. మూర్తి స్ఫురద్రూపి, మధురమైన కంఠస్వరం కలవాడూను. వీటికి తోడు అధ్యాపకులతో అణకువగాను, తోటి విద్యార్థులతో అభిమానంగాను మాట్లాడేవాడు. అతడి పెదవులపైన ఎప్పుడూ చిరునవ్వు తొణికిసలాడుతూ ఉండేది. అసలు నలుగురినీ ఆకర్షించ గలిగిన శక్తి కొందరిలో మాత్రమే వుంటుంది. ఒక వ్యక్తి కనబడగానే "హల్లో" "హల్లో" అంటూ నలుగురూ చుట్టూ చేరతారు. అదే ఇంకొక వ్యక్తి కనబడేసరికి సెక్షన్ 144 అమలులో ఉన్నట్లు ఎక్కడివాళ్లు అక్కడ చెదిరిపోతారు. మూర్తికి ఈ ఆకర్షించేశక్తి దైవికంగా ప్రాప్తించిందో, లేక డేల్ కార్నిజీ చదివి సంపాదించుకొన్నాడో మనకి తెలియదు. కాని బి. ఏ. చదువుతున్నప్పుడు రెండు సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా విద్యార్థి సంఘానికి కార్యదర్శకత్వాన్ని వహించిన ఘనత అతడి ఒక్కడికే దక్కింది.

మూర్తి ప్రస్తుతం ఎం. ఏ. చదువుతున్నాడు. ఈ సంవత్సరంతో అదీ పూర్తి అవుతుంది. మూర్తి చిన్నతనంలోనే అతడి తండ్రి మరణించాడు. ఉన్న కొద్ది ఆస్తిని జాగ్రత్తగా కాపాడుకొంటూ, కష్టంగా సంసారం సాగిస్తూ, మూర్తితల్లి అతడిని ఇంత వరకు చదివిస్తూ పెద్దవాడిని చేసింది. తల్లి తన గురించి ఎంతత్యాగం చేస్తున్నది మూర్తికి తెలుసును. అతడు బి. ఏ. తో చదువు ముగించి ఏదైనా ఉద్యోగంలో ప్రవేశిస్తానన్నాడు. కాని ఆమె అంగీకరించలేదు. అతడు ఎం. ఏ. చదవాలని, పెద్ద ఉద్యోగం చెయ్యాలని, చిన్న ఉద్యోగాలలో ప్రవేశించడం తనకి ఇష్టం లేదని ఆమె చెప్పింది.

భీమారావు మూర్తికి బి. ఏ. లో సహాధ్యాయి. అమాయకుడు. పిరికి స్వభావం కలవాడు. భీమారావు ఈ ప్రపంచంలో ఎలాగ జీవనయాత్ర సాగించగలడా అని ఎల్లప్పుడు అతడి తండ్రి ఆందోళన చెందేవాడు. చొరవ, కపటం, కొంతవరకు అహంభావం, చిన్నవిషయాలకే పెద్దగా గొడవచేసే స్వభావం ఉన్నవాళ్ళే ఇప్పుడు ఇతరులని పక్కకి నెట్టుకొంటూ ముందుకు పోగలుగుతున్నారు. భీమారావులో ఈ గుణాలు వెతికినా లేవు. ఎవరైనా తనవైపు తేరపారి చూస్తే నిద్రభంగి ఆకులాగ వాడిపోతాడు. "భోజనము చేస్తావా?" అని ఎవరైనా ప్రశ్నిస్తే, భీమారావు మొహం కందగడ్డలాగ చేసుకొని, అటూ ఇటూ బెదురుగా చూసి, "ఊఁ" అనేసి అక్కడి నుండి వెళ్లిపోతాడు.

భీమారావుని ఒక మనిషిగా ఎలాగ చెయ్యడమో అతడి తండ్రికి తెలియలేదు. తన మిత్రులలో కొందరిని సలహా అడిగాడు. ఎవరికి తోచింది వాళ్ళు చెప్పారు.

" భీమాశాఖ వారు డెవలెప్‌మెంటు ఆఫీసర్లుగా పట్టభద్రులని వేసుకొంటారు. మీ వాడికి బి.ఏ. పూర్తికాబోతున్నది కదా ! ఆ ఉద్యోగం కోసం ప్రయత్నించండి. వాళ్లు ఆరు వారాలు మాత్రం ట్రెయినింగు ఇస్తారు. కాని ఆ ఆరువారాలలో మనిషిలో ఎంత మార్పు వస్తుందను కొన్నారు ? అసలు ముఖ లక్షణాలు కూడా మారిపోతాయంటే నమ్మండి. ఇక మీదట మీ వాడిగురించి మీకు ఏ చీకు చింతా అవసరం ఉండదు " అని ఒకాయన చెప్పాడు. భీమారావు తండ్రికి ఈ సలహా నచ్చింది.

కొన్ని రోజులు గడిచాయి.

ఒక రోజు సాయంత్రం మూర్తి అలా బజారు బయల్దేరాడు. బస్‌స్టాపుకి అతడు నలభై గజాల దూరంలో ఉండగా ఒక బస్సు వచ్చి ఆగింది. ఒక్క వ్యక్తి మాత్రం దిగాడు. ఎక్కవలసిన వాళ్లు చాలా మంది ఉన్నారు. కండక్టర్ ఒక్కడిని మాత్రం ఎక్కించాడు. తక్కిన వాళ్లకి స్థలం లేదని చెప్పాడు. బెల్ నొక్కాడు. బస్ కదిలింది.

ఇంతలో జనసమూహాన్ని తోసుకొంటూ ఒక టెర్లిన్ కుర్రవాడు నడుస్తున్న బస్సు ఎక్కడానికి ప్రయత్నించాడు. కాలు జారి కింద పడ్డాడు. బస్సు వెళ్లిపోయింది.

అదృష్టం కొద్దీ అతడికి దెబ్బలు తగలలేదు. కాని బట్టల నిండా మాత్రం మట్టి మరకలు అంటుకొన్నాయి. దానికి అతడేమీ విచారించలేదు. ఒక్కసారి సబ్బుతో ఉతికేస్తే పోతాయి. కాని మానసికంగా అతడు పెద్ద దెబ్బ తిన్నాడు. ఇంతమంది చూస్తుంటే తను బోల్తాకొట్టడం ఎంత చిన్నతనం?

అందులోనూ ఇద్దరు అమ్మాయిలు ముసిముసి నవ్వులతో అతడి పాటు గమనించడం అతడు గమనించాడు. అతడు ఇంకొక్క క్షణమైనా అక్కడ నిలబడలేదు. నడుచుకొంటూ ఎక్కడికో వెళ్ళి పోయాడు.

ఈ సంఘటన చూస్తూ మూర్తి బస్‌స్టాపు చేరాడు. జరిగిన దానిగురించి అక్కడ విమర్శలు ప్రారంభం అయ్యాయి.

"వళ్ళు పొగరు" అన్నాడు ఒకాయన.

"అది నిజమే ననుకోండి. కాని ఎంత జాగ్రత్తగా ఉన్నప్పటికి మనకీ ఎప్పుడో ఒకప్పుడు కాలు జారుతుంది. లేదా బస్సే బోల్తా కొడుతుంది. లేదా రైలు తిరగ బడుతుంది. నివసిస్తున్న ఇల్లు కూలిపోతుంది. వచ్చేక్షణం మనది అని చెప్పలేం. మనం వస్తామని పాపం ఇంటివద్ద భార్య, పిల్లలు, మనకోసం ఎదురు చూస్తూ ఉంటారు. ఇక వాళ్ళగతి ఏమౌతుంది ? అందుకే ప్రతీవ్యక్తి తన జీవితాన్ని భీమా చేయించుకోవడం చాలా అవసరం. ప్రీమియంలో రెండు మూడు రూపాయలు అదనంగా చెల్లిస్తే ఇటువంటి దుర్మరణం జరిగినప్పుడు భీమాచేసిన విలువకి రెట్టింపు ఇస్తారు" అని ఒకాయన ఉపన్యాసం ప్రారంభించాడు.

పరిచయమైన కంఠస్వరమే. ఎవరా అని మూర్తి వెనకకు తిరిగి చూచాడు. భీమారావు. అదే క్షణంలో భీమారావు కూడా మూర్తిని చూచాడు.

"హల్లో! మూర్తి" అంటూ దగ్గరికి వచ్చాడు.

"చాలా కాలానికి కనపడ్డావ్ ! మనిషి బాగా మారిపోయావే. ఎక్కడున్నావ్ ! ఏమిటి చేస్తున్నావ్ ? అందరూ క్షేమమేనా ?" అని అడిగాడు మూర్తి.

"భీమాశాఖలో డెవలెప్‌మెంట్ ఆఫీసరుగా పని చేస్తున్నాను. సుమారు ఒక సంవత్సరం కావస్తోంది. ఎం. ఏ. చదువుతున్నావట కదూ. ఈ మధ్యనే తెలిసింది. నీ వద్దకు వద్దామనే అనుకుంటున్నాను. కొంత బిజినెస్ ఇస్తావని" అన్నాడు భీమారావు.

"ఏం బిజినెస్ ?" అన్నాడు మూర్తి అర్థంగాక.

"అదేనోయ్. నీ జీవితం ఒక అయిదువేల రూపాయలకి భీమా చేయిస్తావని" అన్నాడు భీమారావు.

మూర్తి తెల్లబోయాడు. "నాకెందుకయ్యా భీమా ? నాకేం భార్యా పిల్లలూ ఉన్నారా ? ఉద్యోగం ఉన్నదా ?" అన్నాడు.

"ఆ సంగతి నాకు తెలుసును. కాని సవ్యంగా ఆలోచించు. మీ తల్లిగారు నిన్నే నమ్ముకొన్నది. ఆమె ఎంతో త్యాగం చేసి నిన్ను చదివిస్తున్నది. ఇప్పుడు మాటకి అనుకొందాం — నీకేదైనా ఆపద సంభవించిందనుకో. ఆమె పరిస్థితి ఎలాగుంటుందో వూహించావా ? ఆమె జీవితం దుర్భరమైపోతుంది. నీ చదువుకోసం మీ తల్లి ఇల్లు గుల్ల చేసింది. ఆమె జీవించడం ఎలాగ ? అటువంటి క్లిష్టసమయంలో ఆపద్బాంధవులలాగ మేము ఆదుకుంటాం. మేము వెళ్ళి ఆమె దోసిట్లో అయిదువేల రూపాయలు పోస్తాం. నిన్ను పోగొట్టుకొన్న ఆ తల్లి శోకం ఎవరూ తీర్చలేరనుకో. కాని ఆమె తన జీవనోపాధికి కూడా బాధపడే అగత్యం తప్పుతుంది. ఈ విధంగానైనా తల్లి ఋణం తీర్చుకొన్నావనే తృప్తి నీకూ వుంటుంది. ఎలాగో కష్టపడి నెలకి పదిహేను రూపాయలు మిగిల్చి ఒక పాలసీ తీసుకో" అన్నాడు భీమారావు.

మూర్తి ఆశ్చర్యంగా భీమారావువైపు చూచాడు. ఇతడిలో ఎంతమార్పు వచ్చింది అనుకున్నాడు. మనిషి మునుపటి కంటే ఒడ్డూ పొడవూ అయ్యాడు. అతని ముఖంలో పిరికితనం వెతికినా కనబడడం లేదు. కళ్ళు ధైర్యంగా చూస్తున్నాయి. ఇదివరకు భీమారావు ఎన్నడూ తల ఎత్తడం మూర్తి చూడలేదు. — ఒక్కసారి కళ్ళల్లో మందు వేసుకొన్నప్పుడు తప్ప. ఇదివరకు పిలిస్తే పలకడానికే సిగ్గుపడే భీమారావేనా ఇప్పుడు ఈ మాటలాడుతున్నది.?

"అలా తెల్లబోయి చూస్తున్నావేం ?" అన్నాడు భీమారావు.

"నేను నెలకి పదిహేనురూపాయలు మిగల్చడం అసాధ్యం. నేను మరణించేటంతటి దురదృష్టం మా తల్లికి కలిగినప్పుడు ఈ అయిదువేల రూపాయలు కూడా ఆమెకు ప్రయోజనంకావు. నువ్వు చెప్పిన దాంట్లో నిజం లేకపోలేదు. ప్రతి వ్యక్తికి జీవిత భీమా చాలా అవసరం. నాకు ఇప్పట్లో మాత్రం వీలులేదు. అయినా నా చదువు త్వరలోనే ముగుస్తుంది కదా. చూద్దాంలే" అన్నాడు మూర్తి.

ఇంతలో భగవంతుడు ఇచ్చిన వరంలాగ బస్సు వచ్చింది.


## 2

రెండవసారి భీమారావు దర్శనం మూర్తికి సినిమా హాలులో కలిగింది. అక్కడ కూడా భీమాచేయించడంలో గల లాభాలు చెప్తూవచ్చాడు భీమారావు. మూర్తి దురదృష్టంకొద్దీ వాళ్ళు చూచిన చిత్రంలో రెండు మూడు మరణాలు ఉన్నాయి. అసలుమరణం లేని సినిమా లేదనుకొండి — ఈ చిత్రంలో మోతాదు కాస్త ఎక్కువగానే పడింది. ఆ మరణించిన వారు తమ జీవితాలు భీమా చేయించుకొని వుంటే ఈ చిత్రంలో ఎంతమార్పు వచ్చేదో వూహించమన్నాడు భీమారావు. అసలు ఈ చిత్రం తియ్యవలసిన అవసరమే లేకపోయేది అని కూడా విమర్శించాడు.

ఆ రాత్రి మూర్తికి ఎందుకో నోరు చేదుగా ఉన్నట్లు అనిపించింది. పిక్చర్ చూచాడేగాని అతడికి ఏమీ ఉత్సాహం కలగలేదు.

అప్పటినుండి మూర్తి కాస్త జాగ్రత్త పడ్డాడు. ఎక్కడికి వెళ్తున్నా, "హొరైజన్"లో భీమారావు ఉద్భవిస్తున్నాడేమో అని పరికిస్తూనే వెళ్లేవాడు. ఒకసారి భీమారావు దూరాన్న కనిపించగానే మూర్తి పక్క సందులోకి మళ్ళిపోయి తప్పించుకున్నాడు. ఆ తర్వాత అనుకోకుండా ఒకసారి భీమారావుకి మళ్ళా దొరికి పోయాడు.

"జాతస్య మరణం ధృవం" అన్నారు పెద్దలు. అంటే పుట్టాక చావు తప్పదు. అందుకే మనిషిని మోర్టల్ అంటారు ఇంగ్లీషువారు. అంటే చావవలసిన వాడు అని అర్థం. ఎం. ఏ. చదువుతున్నావు. ఇవన్నీ నీకు నేను చెప్పనవసరం లేదు. కాని మరణం అన్నది ఎల్లప్పుడు ప్రతిమనిషికి ఒక గజం ఎత్తున అంతరిక్షంలో తాండవం చేస్తూ ఉంటుంది. అది ఎప్పుడు గభీమని మనమీదికి ఉరుకుతుందో చెప్పలేం. చచ్చి పోయి కూడా సాధించాడని కొందరు అంటారు విన్నానో లేదో. ఇన్స్యూరు చెయ్యడం అంటే సరిగ్గా అదే. మన మరణంలో కూడా ఇతరులకి లాభం కల్పిస్తామన్న మాట. ఇందులో ఆలోచించవలసినది వెనక్కి తగ్గవల్సినది ఏమీ లేదు. నీకు మా ఏజెంటు ఒక తడని మంచివాణ్ణి అప్పచెప్తాను. ఏమంటావ్ ?" అంటూ మొదలెట్టాడు భీమారావు.



మూర్తి ఎలాగో తప్పించుకొని బయట పడ్డాడు.

అప్పటి నుండి భీమారావంటే మూర్తికి అమితమైన భయం పట్టుకొంది. ఇంతవరకు అతడు తన బసకి మాత్రం రాలేదు. ఇక మీదట అక్కడికి కూడా వచ్చి తన చదువు సాగనివ్వడేమో అని బెంగ పెట్టుకొన్నాడు. భీమారావు జ్ఞప్తికి వచ్చేసరికి మూర్తికి ముచ్చెమటలు పోసేవి.

కాని మూర్తి భయం అనవసరం అయింది. రానురాను భీమారావు కనిపించడం ఎందుచాతనో తగ్గి పోయింది. మూర్తి పరీక్షలలో బాగా వ్రాయగలిగాడంటే అదొక ముఖ్యకారణమనే చెప్పాలి.

పరీక్షలు ముగిసాక ఇంటికి వెళ్ళాడు మూర్తి.

"చదువు పూర్తి అయింది. ఇక పెళ్లి మాటమిటంటావ్" అని అడిగింది తల్లి.

"కాస్త ఓపిక పట్టమ్మా, రిజల్ట్సు రావాలి. నేను ప్యాసు కావాలి. ఏదైనా ఉద్యోగం దొరకాలి. నాకు నచ్చిన అమ్మాయి కుదరాలి. అప్పుడు పెళ్లి" అన్నాడు మూర్తి.

మూర్తి ఇష్టపడిన అమ్మాయినే అతడికి పెళ్లి చెయ్యాలని తల్లి సంకల్పం. కాని తనకు ఎటువంటి అమ్మాయి నచ్చుతుందో మూర్తికి

ఇంత వరకు తెలియలేదు. అతడు కాలేజీలో చదువుతున్నప్పుడు అనేక మంది అమ్మాయిలను చూచాడు. కాని అందులో ఎవరిలోనూ ప్రత్యేక మయిన ఆకర్షణ కనిపించలేదు — ఒక్క సరళలో తప్ప. మూర్తి బి. ఏ. చదువుతున్న ప్పుడు సరళ పి. యు. సి. చదువుతూండేది. ఆమెలో మాత్రం ఏదో ప్రత్యేకత ఉన్నట్టు

# వర్జ్యం

మూర్తికి కనపడేది. ఆమెతో అతడికి కొంత పరిచయం ఏర్పడింది. కార్యదర్శి ఎన్నికలలో ఒకటి రెండు సార్లు మూర్తి ఆమెతో మాట్లా డేడు. "మూర్తి గారికే మీ వోటు" అనే రంగు రంగుల నోటీసులు ఆమె కూడా కొన్ని పంచి పెట్టింది. వారి పరిచయం అక్కడితో ఆగింది. తన పరిస్థితుల దృష్ట్యా అప్పటిలో తన వివాహం గురించి ఆలోచించడమే అసంభవం అనిపించింది మూర్తికి. అటువంటప్పుడు ఆమెతో తన స్నేహం అభివృద్ధి చేసి ఇద్దరి మనస్సులలోనూ మమతలు రెచ్చ కొట్టడం అవివేకం అనేఉద్దేశంతో మూర్తి తన మనస్సును నిగ్రహించుకున్నాడు.

పి. యు. సి. పూర్తి అయిన తరువాత సరళ తిరిగి మూర్తికి కనిపించలేదు. చదవడం మాని వేసిందో లేక ఆమె తండ్రికి ఎక్కడికైనా బదిలీ అయి పోయిందో మూర్తికి తెలియలేదు. తెలుసు కోవడానికి అతడు ప్రయత్నించలేదు కూడా. కాని నేటి వరకు ఆమె రూపం మాత్రం అతడి హృదయ ఫలకం మీద నుండి చెరిగిపోలేదు.

పరీక్ష ఫలితాలు తెలిశాయి. మూర్తి ఫస్టు క్లాసులో ప్యాసయినాడు. అతడిని అభినందిస్తూ టెలిగ్రాములు శరపరంగా వచ్చి పడిన్నై. తల్లీ కొడుకుల ఆనందానికి అవధులు లేక పోయిన్నై. ఇక పత్రికలలో "వాంటెడ్" ప్రకటనలు చూడ డం ప్రారంభించాడు మూర్తి. దగ్గరగా ఉన్న ఒక వూళ్ళో కొత్తగా ప్రారంభిస్తున్న ఒక కాలేజీకి అసిస్టెంటు లెక్చరర్లు కావాలనే ప్రకటన అతడి కంట పడింది. వెంటనే దరఖాస్తు పంపాడు.

దేనికైనా రోజులు కలిసిరావాలి. పదిహేను రోజులలోగానే కాలేజీ కమిటీ వారి వద్ద నుండి జవాబు వచ్చింది— ఇంటర్వ్యూకి రమ్మంటూ. ఫలానా తేదీ అని వారు నిర్ణయించడం నుంచి మంచి రోజు చూడవలసిన అవసరం లేకపోయింది మూర్తికి. తెల్లవారితే ఇంటర్వ్యూ అనగా ఆ వూరు చేరాడు. ఒక వసతి గృహంలో మకాం పెట్టాడు.

మూర్తితో బాటు ఇంకొక ఆరుగురు కూడా ఇంటర్వ్యూకి హాజరు అయినారు. కాలేజీ అధి కార్లు మూర్తిని ఏవేవో ప్రశ్నలు వేశారు. మూర్తి వాళ్ళకి సరియైన సమాధానాలు చెప్పాడు.

ఆరుగురిని ఈ విధంగా పరీక్షించేటప్పటికి పన్నెండున్నర గంటలయింది. ఎవరిని వెళ్ళిపోవద్దని ఒక్క అర గంట ఆగవలసిందని కమిటీ వారు కోరారు. మూర్తికి ఆకలి దహించేస్తున్నా నిరీక్షిం చక తప్పింది కాదు.

ఒంటి గంట అయ్యేటప్పటికి ఫలితాలు తెల్ప బడిన్నై. మూర్తిని, అతడితో బాటు ఇంకొక ఇద్ద రిని కమిటీ వారు ఆమోదించారు. ఆర్డర్లు కూడా చేతికి ఇచ్చారు.

ఆర్డరు చేతిలో పడగానే మూర్తి ముఖకైవా రం మూడు అంగుళాలు పెరిగింది. అందరి వద్ద శలవు తీసుకొని బయటకు వచ్చాడు. ఎదురుగా కనిపిస్తున్న హోటలులో భోజనం చేసి, బసకి బయల్దేరాడు.

## 3

ఇన్నాళ్ళకి తన కష్టాలు, తన తల్లి కష్టాలూ ఒడ్డెక్కాయి అనుకొన్నాడు మూర్తి తోవలో. తల్లి ఋణం తీర్చుకొనే అవకాశం ఇప్పుడు తనకి కలిగింది. ఇక ఆమెను ఏ విధంగాను కష్ట పడనివ్వ కూడదని నిశ్చయించు కొన్నాడు. ఆమె కోరిక ప్రకారం తనకి నచ్చిన అమ్మాయిని అతడు వివాహం చేసుకోవాలది కూడా.




హ్యూలెట్స్ మిక్స్చర్
వాడి వెంటనే విముక్తి పొందండి

బిడ్డలను పోషించుకోడమేగాక ఇంటిపని కూడా చేస్తూ మీరు కష్టమైన రెండు బాధ్యతలను ఒకేసారి నిర్వ హిస్తున్నారు. అలాంటప్పుడు అజీర్ణంవల్ల మీ దినచర్య చేసుకోలేక బాధపడటం దేనికి? హ్యూలెట్స్ మిక్స్చర్ తీసుకోండి. అది త్వరగా శాశ్వతమైన నివారణ నిస్తుంది. అది జీర్ణకోశం లోపలి భాగమున సురక్షకమైన పూతగా వేర్పడి అందలి చిరాకు కల్గించు ఆమ్లసారములను నిస్సా రము చేసి ఆహారం సక్రమంగా జీర్ణమగుటకు తోడ్పడును.

హ్యూలెట్స్ మిక్స్చర్ పిల్లల జీర్ణాశయ బాధలను కూడా చక్కగా పనిచేస్తుంది. అధికంగా విరేచనాలవుతుంటే నల్ల మందు చేర్చిన హ్యూలెట్స్ మిక్స్చర్ను తీసుకోండి. హ్యూలెట్స్ మిక్స్చర్ జీర్ణశక్తికి తోడ్పడును.




సి.జె. హ్యూలెట్ & సన్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
88/A నైనియప్ప నాయకన్ వీధి, మద్రాసు-1

JWT/CJH-1930

ఎండ మండి పోతోంది. రిక్షాని పిలిస్తే బాగుంటుంది అనుకొన్నాడు మూర్తి. నాలుగు వైపులా చూచాడు. కనుచూపుమేరలో ఎక్కడా రిక్షా కనిపించ లేదు. పైగా ఇది ఇందాకటి తను వచ్చిన వీధికాదని గ్రహించాడు. తను వచ్చింది. మెయిన్ రోడ్డు దారి తప్పాడా ? ఇంటర్వ్యూకికి తను వచ్చినప్పుడు తోవ గుర్తుంచుకొన్నాడు. మెయిన్‌రోడ్డు వదిలి కుడిచేతి వైపు తిరిగి మళ్ళా ఎడంచేతి వైపు తిరిగితే కమిటీ ఆఫీసు వచ్చింది. ఇప్పుడు భోజనం చేసి బయల్దేరినప్పుడు మూర్తి కుడిచేతి వైపు నడిచి మళ్ళా కుడిచేతి వైపే తిరిగాడు. కాని మెయిన్ రోడ్డు రాలేదు. ఇదేదో ఈ సిధిలో పడ్డాడు. ఏమో ! అనుకొన్నాడు. వెంటనే మూర్తికి జరిగిన పొరబాటు తెలిసింది. హోటలు కాలేజీ కమిటీ ఆఫీసుకి ఎదుట ఉన్నది. అందుచేత తను బయటకు రాగానే ఎడంచేతి వైపు మళ్ళ వలసింది. తను పెట్టుకున్న గుర్తు ప్రకారం కుడిచేతి వైపు పరధ్యానంగా నడిచి రావడం ఇప్పుడు తోవ తప్పాడు.

మూర్తికి ఏమిటి చెయ్యాలో తోచలేదు. ఎవరైనా కనిపిస్తే అడిగి తోవ తెలుసుకొందామనుకొన్నాడు. ఎవ్వరూ కనిపించలేదు. రోడ్డు నిర్మానుష్యంగా ఉన్నది. వచ్చిన తోవనే వెనకకి మళ్లి మళ్ళా కమిటి ఆఫీసు చేరుకోవాలనుకొన్నాడు.

ఇంతలో దూరం నుండి ఎవరో ఒక వ్యక్తి తన వైపే వస్తూండటం గమనించాడు. మూర్తి వెంటనే తన తిరోగమన పథకం రద్దుచేసి తిరిగిపురోగమించాడు ఎదురుగా వస్తున్న వ్యక్తి దగ్గర పడుతున్న కొలదీ అతడు తనకు ఇదివరకు పరిచయం ఉన్న వ్యక్తేనని పించింది మూర్తికి. మరి నాలుగు అడుగులు వెయ్యగానే ఆ వస్తున్నదెవరో గుర్తుపట్టగలిగాడు. అతడి గుండె కొట్టుకొనటం మానేసింది. ఆ నడక, ఆ వాటం, ఆ చేతిలో వాలెట్ — భీమారావు. సందేహం లేదు.

ఇప్పుడు భీమారావు కంట తను ఎంత మాత్రం పడకూడదు అనుకొన్నాడు మూర్తి. తనకి ఉద్యోగం దొరికిందని తెలిస్తే ఇక తను భీమా చేసే వరకు వదలడు. తనకి మొదటి నెల జీతం రాగానే దరఖాస్తు ఫారం పైన సతకం చేస్తానని చెప్పినా ఒప్పుకోడు. పైగా సాయంత్రం వరకు తన వెంటే పడతాడు. తన మధుర స్వప్నాలు పాడు చేస్తాడు. అకస్మిక మరణాలు, కుటుంబ భారాలు జ్ఞప్తికి తెస్తాడు. ఎంతో ఉత్సాహంగా గడప వలసిన రోజు ఇది. భీమారావు దీనిని విషాదంగా మార్చేస్తాడు.

మూర్తి నడుస్తున్న పక్కనే ఒక ప్రహరీ గోడ, ఒక గేటు కనిపించాయి. భీమారావు దాటి పోయే వరకూ తను ఆ ప్రహరీలో దాక్కుంటే ఈ అవాంతరం గడిచి పోతుందనుకొన్నాడు మూర్తి. గేటు తీసే ఉన్నది. లోపల ప్రవేశించాడు. గేటు పక్కనే నిలబడి రోడ్డువైపు తొంగి చూడ సం ప్రారంభించాడు.

ఇంతలో తన వెనుక వైపు ఎవరో ఎండు టాకులపైన నడిచిన శబ్దం వినిపించింది మూర్తికి. వెనక్కి తిరిగి చూచాడు.

ఒక భీకరమైన పెంపుడు కుక్క తనవైపే వస్తున్నది. అది ఏదో దుష్కృతం తలబెట్టినట్టు దాని ముఖం చూడగానే మూర్తికి తెలిసింది.

## 4

రామయ్యగారు స్థితిపరుడు. పైగా తహశిల్దారు ఉద్యోగం చేస్తున్నారు. సరళ వారి కుమార్తె, ఏకైక సంతానం. సరళ పి. యు. సి. ప్యాసయిన కొద్ది రోజులకే రామయ్యగారికి ఈ వూరు బదిలీ అయింది. ఈ వూళ్ళో ఇంత వరకు కాలేజీ లేక పోవడం నుండి, పై చదువుల కోసం ఆమెను ఇంకొక వూరు పంపడం రామయ్యగారికి, వారి సతీ మణికి ఇష్టం లేకపోవడం నుండి, సరళ చదువు అంతటితో ఆగి పోయింది.

సరళ చక్కటి అమ్మాయి. చాలా తెలివైనది. కథలు కూడా వ్రాస్తూంటుంది. ఆమె వ్రాసిన కథలు చదువుతూంటే, ఇంత అనుభవం, ఇంత లోకజ్ఞానం కుమారిగా ఉన్న తన కుమార్తెకు ఎలాగ కలిగినవా అని రామయ్యగారే ఆశ్చర్య పడుతూండేవారు. ఇన్‌కమ్‌టాక్సు వాళ్ళకి ఒక కొత్త "ఎససీ" దొరికినంత ఆనందంతో ఆమె పంపిన ప్రతీ కథా పత్రికల వాళ్ళు స్వీకరించేవారు. ఒక పేజీకి సరిపోయినంత "సరాగమ్" బొమ్మ వేయించేవారు. ఇక పాఠకుల సంగతి సరేసరి. "కుమారి సరళ వ్రాసిన— కథ నన్నెంతో ఆకర్షించింది. పేజీ తాకుతే చాలు వాస్తవికత చేతికి అంటుకొంటున్న దంటే నమ్మండి. ఇంతటి చక్కటి కథ వ్రాసిన రచయిత్రికి, ప్రచురించిన మీకు నా ధన్యవాదాలు అర్పించకుండా ఉండలేక పోతున్నాను." అంటూ ఒక టేఉత్తరాల గొడవ.

అయితే ప్రతీ కథలోను నాయకి, తన ప్రియుణ్ణి పొందలేక చివరికి ఆత్మహత్య చేసుకొన్నట్టు సరళ విధిగా చూపించేది. ప్రతీకథా ఇదే విధంగా విషాదాంతం కావడం రామయ్య గారికి కాస్త వెగటుగా తోచేది. సరళ మానసికంగా ఏదో బాధ పడుతున్నదని ఈ విషాదాంతాలు దాని ప్రతిబింబాలేమో అని రామయ్యగారికి భయం పట్టుకొన్నది. తన ఆంతరంగిక మిత్రులతో ఈ విషయ ఆయన చెప్పారు.

ఆంతరంగిక మిత్రులు రామయ్యగారు చెప్పినది విని కొంత సేపు మవునంగా ఆలోచించారు. వారి ముఖాలు గంభీరంగా మారినై. "ఇది ఒక చిత్రమైన మనోవికారం. ఆమెకి వెంటనే పెళ్లి చెయ్యాలి లేకపోతే ఇది ఎంతటి ప్రమాదానికైనా తియ్యవచ్చు" అని ఏకగ్రీవంగా సలహా ఇచ్చారు.


అప్పటి నుండి రామయ్యగారు సరళకి తగిన వరుణ్ణి అన్వేషించడం ప్రారంభించారు. రెండు మూడు సంబంధాలు తీసుకొని వచ్చారు. ఆ వరులు వచ్చి సరళని చూచారు. వాళ్లకి సరళ నచ్చింది. కాని సరళకి వాళ్లెవరు నచ్చలేదు. అందులో ఎవరిని కూడా చేసుకోనని ఖచ్చితంగా చెప్పింది.

"పోని నీ మనస్సులో ఎవరైనా ఉంటే చెప్పమ్మా" అని తల్లి తండ్రులు అడిగారు.

సరళ జవాబు చెప్పలేదు. ఆమె చెప్పవలసింది ఏమీ లేదు కూడా. ఆమె మనస్సులో ఒక నీడ మాత్రం నిలిచి ఉన్నది. సరళ చదువుకొంటున్న రోజులలో మూర్తి ఆమెను ఆకర్షించి ఆమె హృదయంలో ఒక స్థానం కల్పించు కొన్నాడు. కాని అచిర కాలంలోనే అతడు ఆమె జీవితం నుండి తొలగి పోయాడు. అతడి పైన ఆమెకు కలిగిన ప్రేమ సఫలత పొందడానికి అవకాశం లేక పోయింది. మూర్తి ఇప్పుడు ఎక్కడ ఉన్నది ఏమిటి చేస్తున్నది, అతడికి వివాహం అయినది, లేనిది ఆమెకు తెలియవు. అతడి పూర్తి పేరు శ్రీరామ చంద్రమూర్తి అని, అతడికి తండ్రి లేడని మాత్రం ఆమె ఇదివరకు తెలుసుకొన్నది. ఈ రెండు వివరాలు ఆధారంగా అతడిని వెదికి తీసుకొని రమ్మని తండ్రితో చెప్తే చాలా అసందర్భంగా ఉంటుంది. మూర్తిని మరిచి పోవడానికే సరళ ప్రయత్నిస్తోంది. కాని ఇంతవరకు ఇంకెవరినీ వివాహం చేసుకోడానికి ఆమె అంగీకరించలేక పోతున్నది. తండ్రిని అనవసరంగా బాధించ వలసి వస్తున్నదని ఆమె బాధ పడుతోంది.

"వాళ్లెవరూ నాకు నచ్చలేదు. అంతే" అని

44 వ పేజీ చూడండి




"ఇదుగోనయ్యా నీ సైకిలు!... అద్దెంతయ్యింది?"

సరళ నవహాథాసం చెప్పింది.

రామయ్యగారు తిరిగి ప్రయత్నం ప్రారంభించారు. ఈ మధ్యనే ఇంకొక మంచి సంబంధం ఎవరో మధ్యవర్తి ద్వారా ఏర్పాటయింది. వధూవరులు ఒకరొకరు చూడడం ఆమోదించడం జరిగాక తక్కిన విషయాలు మాట్లాడుకోవచ్చును. కాబట్టి అతడిని పంపమంటూ పెళ్లికొడుకు తండ్రిపేర ఉత్తరం వ్రాశారు రామయ్యగారు.

## 5

తన వైపు వస్తున్న కుక్కని చూచేసరికి మూర్తి ప్రాణాలు నిలువునా ఎగిరిపోయినై. గేటు దాటి రోడ్డు మీదికి పారిపోదాం అంటే అమాంతంగా భీమారావు చేతిలో పడతాడు. ఇక్కడే ఉంటే ఈ శునకరూప రాక్షసి తనని చిత్రవధ చెయ్యడం తథ్యం. ఒక లిప్తకాలం మూర్తి ఆలోచించాడు. ఈ కుక్క యజమానులే తనని రక్షించాలన్న నిశ్చయానికి వచ్చాడు. ఒక్క పరుగున ఆ ఇంటి వైపు దారితీశాడు.

మూర్తి ఇంటివైపు పరిగెత్తడం చూడగానే ఆ కుక్కకి మరీ కోపం వచ్చింది. వెంటనే తన వేగాన్ని హెచ్చించి అతడిని వెంబడించింది. మూర్తి హాలులో కాలుపెట్టేసరికి కుక్క అతడి పంట్లాం పట్టుకొని లాగింది.

"ఛీ ఛీ వెధవ కుక్క, దీనిని కట్టి వేయమని చెప్పాను. ఎవరు విప్పారు ?" అంటూ రామయ్యగారు కుర్చీలో నుంచి లేచివచ్చారు. "ఒరే వెంకయ్యా ఈ కుక్కని తీసుకొనిపో" అని శూన్యంలోకి ప్రసారం చేసి "రా, బాబూ" అని మూర్తిని ఆహ్వానించారు. వెంటనే గోడమీద నున్న గడియారం చూచారు.

"అబ్బో ! రెండు గంటలయి పోయిందే. ఇంకొక్క పది నిముషాలు మాత్రం వ్యవధి ఉన్నది. మేడ మీదికిరా అబ్బాయి" అంటూ నడిచారు రామయ్యగారు.

తను మేడమీదికి ఎందుకు వెళ్లాలో మూర్తికి అర్థం కాలేదు. ఎండ దెబ్బ, భీమారావుని చూచిన భయం, కుక్కవల్ల కలిగిన అనుకోని పరుగు, తప్పిన గండం, వీటితో వూపిరి అందకుండా ఉన్నది మూర్తికి. ఇప్పుడు మేడ ఎక్కే పరిస్థితిలో అతడు లేడు. కాని అప్పుడే రామయ్యగారు మెట్ల వరకు వెళ్లారు. ఈయన వెళ్లాక ఆ కుక్క తిరిగి వచ్చిందా— మూర్తి మరి ఆలోచించలేదు. వెంటనే లేచి ఆయన వెంట మేడమీదకి వెళ్లాడు.

మేడమీద గది చాలా ఆకర్షణీయంగా ఉన్నది. సోఫాలు, టేబిళ్లు ఇత్యాదులన్నీ లక్షణంగా అమర్చబడి ఉన్నై. వీరెవరో ధనికులు, సంస్కారం కలవాళ్లూ అయి ఉండాలనుకొన్నాడు మూర్తి సోఫాలో కూర్చొంటూ.

"ఇదిగో, వెంటనే అమ్మాయిని తీసుకురావాలి" అని రామయ్యగారు కేకవేశారు.

పక్క గదిలో నుండి రామయ్యగారి భార్య కుమార్తెను తీసుకువచ్చింది.

"అమ్మాయిని త్వరగా చూడబ్బాయ్. ఇంకా అయిదు నిముషాలే ఉన్నది" అన్నారు రామయ్యగారు.

## వర్జ్యం

19 వ పేజీ తరువాయి

మూర్తికి బోధపడలేదు. కాని అమ్మాయిని చూడు అనే ఆదేశం విన్నాక చూడని అబ్బాయి ఉంటాడా ? మూర్తి అప్రయత్నంగా ఆ అమ్మాయి వైపు చూచాడు.

సరళ !

అదే క్షణంలో సరళ కూడా తల ఎత్తి చూచింది. ఆమె కలలో కూడా అనుకోని వ్యక్తి కనిపించాడు. మూర్తి !

"అమ్మాయి నీకు నచ్చిందా బాబూ ! త్వరగా చెప్పు" అన్నారు రామయ్యగారు.

మూర్తి అదిరి పడ్డాడు. "నాకా ? ఇందులో ఏదో—"

"ముందు నచ్చిందో లేదో త్వరగా చెప్పు. రెండు నిముషాలు మాత్రం ఉన్నది. తక్కిన విషయాలు తరువాత మాట్లాడుకోవచ్చును. నచ్చిందా? అంటూ ఒత్తిడి చేశారు రామయ్యగారు.

"నచ్చడానికేం ? బ్రహ్మాండంగా నచ్చింది. కాని—"

"ఆగు ఆగు, ఇదిగో అమ్మాయి ఇష్టపడిందో లేదో వెంటనే కనుక్కొని చెప్పు. ఇక్కడ చెప్పడానికి సిగ్గుపడుతుందేమో— ఆ వరండాలోకి

తీర్పు చెప్పబోయేముందు జడ్జి ప్రతివాదిని జూచి—

జడ్జి : ఏమయ్యా ! ఆఖరుసారిగా కోర్టువారి ముందు ఏదైనా ఉంచదల్చుకున్నావా ?

ప్రతివాది : నావల్ల కాదు బాబోయ్ ! నా దగ్గర ఉన్న ఆఖరి నయాపైసా కూడా ఈ దావాలో ఖర్చయిపోయింది!

ఎం. మాధవ్‌రావు (తెనాలి)

తీసుకొని వెళ్లి అడుగు త్వరగా." అన్నారు రామయ్యగారు భార్యతో.

"అమ్మాయి కూడా ఇష్టపడింది" అని ఒక నిముషంలోనే వరండాలో నుండి కేక వినిపించింది. వాచీ పెద్దముల్లు సరిగ్గా పదిమీదికి చేరింది.

"గెల్చాం ! గడియారాన్ని, దానిని నమ్ముకొని బ్రతుకుతున్న వర్జ్యాన్ని కూడా గెలిచేశాం. హమ్మయ్య ! ఇన్నాళ్లకి భారం తీరిపోయింది. చివరికి నిన్ను చేరుకోవడానికి ఇష్టపడింది. ఎన్ని సంబంధాలు చూచాననుకొన్నావ్ ! పాపం ఆ కుర్రవాళ్లందరూ మా సరళని చూచి ఇష్టపడ్డారు. కాని మా అమ్మాయి మాత్రం ప్రతీసారి వద్దన్నమాటే. ఆ తర్వాత ఆ కుర్రవాళ్ల తల్లిదండ్రులు నాకు ఏవో నేప్టీ ఉత్తరాలు వ్రాయడం. అందుకే కిందటి సారి నుండి ఈ కొత్త పద్ధతి ప్రవేశపెట్టాను. ఒకరికి ఒకరు నచ్చింది లేనిది వెంటనే చెప్పించేస్తున్నాను. లేకపోతే ఆ వరుడే స్వయంగా వింటాడు. దానిని తనే వాళ్ల ఇంటికి మోసుకు పోతాడు. తనకి అమ్మాయి నచ్చలేదని తల్లి తండ్రులతో చెప్తాడు. దానితో కుర్రవాని పరువు దక్కుతున్నది. నాకు ఉత్తర ప్రత్యుత్తరాల బాధ తప్పుతున్నది. అయితే ఈ సారైనా అమ్మాయికి నచ్చుతుందేమోనని నాకు ఆశ కలగడం సహజం కదూ. లేకలేక శుభ వార్త చివరికి వర్జ్యం వేళలో అమ్మాయి చాత చెప్పించవలసి వస్తుందేమో అని నా భయం. అందుకే కార్యక్రమం శరవేగంతో జరిపించ వలసి వచ్చింది" అని విపులంగా చెప్పారు రామయ్యగారు.

రామయ్యగారు లేచి చప్పట్లు చరుస్తూ గంతులు వెయ్యలేదు కాని అంత ఆనందంగానూ ఉన్నారు. ఆయన కళ్లు మిలమిల మెరిసి పోతున్నై.

"నువ్వు రైలుదిగి సరాసరి వచ్చి ఉంటే ఈ హడావడి లేక పోను" అన్నారు రామయ్యగారు మళ్లా.

"క్షమించండి. నేను—" అని చెప్పబోయాడు మూర్తి.

ఇంతలో రామయ్యగారి భార్య కాఫీ ఫలహారాలు తెచ్చి అక్కడ పెట్టింది. ఆమె ముఖంలోనూ సంతోష రేఖలు స్పష్టంగా కనబడుతున్నై.

"అవునవును ఏదో ఆటంకం వచ్చి ఉంటుంది. బహుశ రైలును లేటు అయి ఉంటుంది. అన్నట్టు మా సీతారామయ్యను నీకు పరిచయం చెయ్యాలి" అన్నారు రామయ్యగారు.

సీతారామయ్య ఎవరా అని మూర్తి నాలుగు వైపులా చూశాడు. ఎవరూ కనిపించలేదు.

రామయ్యగారు నవ్వారు. "తెల్లబోయి చూస్తున్నావేం ? ఇదిగో ఈ ఎడగారి పేరే సీతారామయ్య. ఇంటిపేరు లేని వాళ్లలాగ తమపేరు వెనక భర్తపేరు తగిలించుకోవడం ఇప్పుడు అందరికీ ఫాషన్ కదూ. మా ఆవిడ పేరు సీత. మరి నా పేరు రామయ్య. అందుచాత ఈమెను సీతారామయ్య అని పేరు పెట్టుకోమన్నాను. కాని ఆవిడకి నా సలహా ఇష్టపడడం లేదు" అన్నాడు.

"కొత్తవాళ్లు ఉన్నారనేనా లేకుండా ఏమిటా మాటలు" అన్నది సీతమ్మ ఓవైపు కోపం, ఇంకో వైపు నవ్వుతో.

## 6

పెళ్లికొడుకు బదులు మూర్తి ఎందుకు వచ్చాడో సరళకి బోధ పడలేదు. రావలసినది మూర్తి కాదని ఆమెకు స్పష్టంగా తెలుసును. ఆ వరుడి పేరు ఇంకేదో ఉన్నది. అతడి తండ్రి తన తండ్రి పేర వ్రాసిన ఉత్తరం సరళ చదివింది కూడా. మూర్తికి తండ్రి లేడని సరళకి ఇది వరకే తెలుసును. మరైతే మూర్తి ఎలా వచ్చినట్టు ? ఎందుకు వచ్చినట్టు ? ఏమీ తోచక ఆమె కిటికీ వద్ద నిలబడి వీధివైపు శూన్యంగా చూస్తూ నిలబడ్డది.

ఇంతలో తమ ఇంటిగేటు దాటి ఎవరో అబ్బాయి తమ ఇంటిలోకి రావడం సరళ చూసింది. ఆమెకు మెరుపులాగ వెంటనే చాలా వరకు సమస్య పరిష్కారం అయింది. ఆ వస్తున్నవాడే అసలు వరుడై ఉండాలి. మూర్తి ఇతడి కంటే ముందుగా రావడం తటస్థించింది. అయితే ఏ కారణంతో వచ్చాడో

తెలియదు. మూర్తే పెళ్ళికొడుకని ఆమె తండ్రి పొరబడి ఉండాలి. ఆ మాటే మూర్తి చెప్ప బోతున్నట్టున్నది కూడా సరళ ఆలోచించింది. ఈ అవకాశం ఆగర ఇవ్వకూడదు. మూర్తి తనని వివాహం చేసుకోవడానికి ఇష్టపడినట్లు తన చెవులతో విన్నది. తను కొంత తెలివి తేటలతో ప్రవర్తించిందా చిరకాలం నుండి తన మనస్సులో ఉన్న కోర్కె ఈడేర వచ్చును. ఆమె వెంటనే నౌకరు వెంకయ్యని పిలిచింది. ఆ వచ్చినది ఎవరని అడిగింది.

"అయ్యగారితో ముఖ్యమైన పని ఉన్నదంటు టున్నాడమ్మా, పేరేమిటో చెప్పలేదు" అన్నాడు వెంకయ్య.

"అయ్యగారు ఎవరితోనో మాట్లాడుతున్నా రని చెప్పు. అతడు వెళ్ళిపోతాడేమో చూడు. అంతగా కదలకపోతే హాల్లోనే కూర్చోపెట్టు. మేడమీదికి మాత్రం పంపించకు" అని చెప్పింది సరళ.

కథ ఏ విధంగా నడుస్తున్నదీ తెలుసుకోవ డానికి రామయ్యగారు, మూర్తి, మాట్లాడు కొంటున్న గది ద్వారం వద్ద పొంచి నిలబడి వినడం మొదలెట్టింది సరళ. మూర్తి యధార్థం చెప్ప డానికి ప్రయత్నిస్తున్నాడు. అతడు చెప్పడానికి అవకాశం లేకుండా తండ్రి తన ధోరణితో అతడికి అంతరాయం కల్పిస్తున్నాడు. కాని మూర్తి ఎప్పటి కైనా నిజం బయట పెట్టక తప్పదు. అప్పుడు తన తండ్రి మనస్సు ఎలాగ మారుతుందో చెప్ప డం కష్టం. జరిగిన పొరపాటుకి క్షమాపణ చెప్పి మూర్తి వెళ్ళిపోవడానికి అవకాశం ఉన్నది. అలాగ జరిగిందా సరళ నిర్మించుకొన్న ఆశాసౌధం వెంటనే కూలిపోతుంది.

"కాఫీ తీసుకో. చల్లారి పోతుంది. ఆ తరువాత మాట్లాడుకోవచ్చును" అంటున్నారు రామయ్య గారు.

"నేను చెప్పింది మీరు ముందు వినాలి. అంతవరకు నేను కాఫీ తీసుకో దలచుకోలేదు" అన్నాడు మూర్తి దృఢనిశ్చయంతో.

సరళ నరాలన్నీ ఒక్కసారిగా బిగుసుకొన్నాయి. ఇక నిజం బయట పడే "క్రైసిస్" వస్తున్నది. ఈ సమయంలో ఏదో ఒకటి చేయకపోతే పరిస్థితి విషమించ వచ్చును. ఆమెకి వెంటనే ఒక ఆలోచన కలిగింది.

"నాన్నగారూ" అంటూ తన యావచ్ఛక్తిని వినియోగించి కేకవేసింది.

రామయ్యగారు, వారి భార్య ఖంగారుగా పరిగెత్తి వచ్చారు.

"ఏమమ్మా ? ఏమిటయింది ?" అని రామయ్య గారు ప్రశ్నించారు నాలుగు వైపులు చూస్తూ.

"పెళ్ళికొడుకుల వద్ద నన్ను ప్రదర్శించడం ఇప్పటికైనా పూర్తి అయిందా ? ఇంకెవరైనా తీసుకు వస్తారా ?" అన్నది సరళ, లేని కటువు తనం ప్రదర్శిస్తూ.

"ఈ ప్రశ్న వేయడానికే అంత గట్టిగా పిల్చా వటమ్మా. ఏమయిం పోయిందో అని మేము హడలి పోయాం. పాపం ఆ కుర్రవాడు ఏదో చెప్తూంటే విన కుండా వచ్చాను. ఇంతకీ మీ రిద్దరూ ఇష్ట పడ్డారు. ఇంకా ఇతర సంబంధాలు వెతికి నిన్ను చూపించ వలసిన అవసరం ఏమిటుంటుంది ?" అన్నారు రామయ్యగారు.

"అది కాదు. ఈ సంబంధం తప్పి పోవడానికి ఏవైనా ఆటంకాలు వస్తాయనుకోండి. వాటిని మీరు ఎదుర్కొంటారా ?" అని అడిగింది సరళ.

"నా ఆస్తి అంతా ధారపోసి అయినా ఈ సంబంధమే చేస్తాను. సరా ?" అన్నారు రామయ్య గారు.

"ఆ వచ్చినది మీరనుకొన్న అబ్బాయేనని నిర్ధారణ చేసుకొన్నారా ?" అని సరళ తిరిగి ప్రశ్నించింది.

"అతడిని ఈ రోజు పంపమని అతడి తండ్రికి వ్రాశాం. ఈ నాటికి ఇక్కడికి వెళ్ళమని కొడుకు పేర ఉత్తరం వ్రాసినట్టు అతడి తండ్రి మనకి ఉత్తరం వ్రాశాడు. ఇతడు వచ్చాడు. ఇంకా నిర్ధారణ ఏమిటి ? తనే పెళ్ళి కొడుకునంటూ ఇంకొకరు రావడం మొదలైనవి నువ్వు వ్రాసే పిచ్చి కథలలో తప్ప వాస్తవంగా జరగవు" అన్నది సరళ తల్లి.

"ఇంతకీ పోస్టు ఆఫీసు వాళ్ళలాగ అయిడెంటీ కార్డు చూపించమని అడగనా ? సాక్ష్యులని తీసుకు రమ్మంటావా ? పోనీ మనం అనుకొన్న అబ్బాయి అతడు కాడనుకో. మీరిద్దరూ ఇష్టపడ్డారు కాబట్టి అతడికే నిన్ను ఇచ్చి వివాహం చేస్తాను" అన్నారు రామయ్యగారు.

"అలాగని నా చేతిలో ఒట్టు వెయ్యండి" అన్నది సరళ.

"నా మాటపైన ఆ మాత్రం నమ్మకం లేదమ్మా ?" అన్నారు రామయ్యగారు.

"ఎంత చదువుకొన్న దానివైనా పెళ్ళి గురించి అంత నిర్మొగ మాటంగా మాట్లాడ కూడదు. మీ తండ్రి ఇంతవరకు ప్రతిది నీ ఇష్ట ప్రకా రమే చేస్తూ వచ్చారు. ఇందులో సందేహం దేనికి ?" అన్నది సీతమ్మ.

"అబ్బాయిని ఒక్కడిని వదిలేసి వచ్చాం. బాగుండదు" అంటూ రామయ్యగారు తిరిగి మూర్తి వద్దకు వెళ్ళారు.

"అమ్మాయి అనవసరంగా ఖంగారెత్తించింది. ఇంతా చేస్తే ఏమీ లేదు. నువ్వు ఏదో చెప్పబోతు న్నావ్ ? ఇప్పుడు చెప్పు ?" అన్నారు రామయ్య గారు కూర్చొంటూ.

"నేను మీ రనుకొంటున్న పెళ్ళి కొడుకుని కాను" అన్నాడు మూర్తి.

"ఏమిటీ ?" అన్నారు రామయ్యగారు తుళ్ళి పడి.

"నేను మీ ఇంట్లో అనుకోకుండా ప్రవేశించ వలసి వచ్చింది. దానికి కారణం ఇది" అంటూ జరిగిన దంతా చెప్పాడు మూర్తి, తన స్వీయ చరి త్రతో సహా.

రామయ్యగారు కొన్ని క్షణాలు మౌనం వహిం చారు.

"నీకు ఇంతవరకు పెళ్ళికాలేదని, నువ్వు మా అమ్మాయిని వివాహం చేసుకోవడానికి ఇష్ట పడ్డావని నీ మాటల వలన నాకు అర్థం అయింది. నిజమేనా ?" అన్నారు చివరికి.

"రెండూ నిజమే" అన్నాడు మూర్తి.

"ఇది వరకు మా అమ్మాయి నిన్ను ఎప్పుడేనా చూచిందా ?" అన్నారు రామయ్యగారు.


"నేను బి. య్యే. చదువుతున్న రోజులలో ఆమె పి. యు. సి. చదివేది. అప్పుడు కొంత ముఖ పరిచయం ఉండేది" అన్నాడు మూర్తి.

అదీ సంగతి అనుకొన్నారు రామయ్యగారు.

"నువ్వు మా అమ్మాయిని చేసుకోవడానికి మీ తల్లిగారు ఇష్టపడతారా ?" అని రామయ్య గారు మళ్ళీ ప్రశ్నించారు.

"నేను ఇష్టపడిన అమ్మాయిని నాకు వివా హం చెయ్యాలనే ఆమె అభిలాష" అన్నాడు మూర్తి.

గది ద్వారం వద్ద నిలబడి వింటున్న సరళ కళ్ళు ఆనందంతో నిండినై.



"ఇక నే నెవరినో నా స్థితిగతులు ఏటువంటివో చెప్తాను. విను" అంటూ రామయ్యగారు తన గురించి తన కుటుంబం గురించి వివరాలన్నీ చెప్పారు.

అది వరకే ఎందుకో మేడదిగి వెళ్లిన సీతమ్మ గారు అప్పుడే తిరిగి వచ్చారు.

"ఇదిగో, ఓ చిత్రం జరిగింది. ఇతడు మనం అనుకొన్న అబ్బాయి కాడు. కాని మన అదృష్టం కొద్దీ అంతకంటే ఎక్కువ యోగ్యత కలవాడు. ఏమిటి జరిగిందో తెలుసా ?" అంటూ కథంతా రామయ్యగారు ఆమెతో చెప్పారు.

అంతా విన్నది సీతమ్మ. "అలాగా, చాలా సంతోషం. అన్నట్టు చావిట్లో ఎవరో అబ్బాయి మీ కోసం నిరీక్షిస్తూ కూర్చొన్నాడు. బహుశ ఆ మొదట అనుకొన్న కుర్రాడేమో" అన్నది ఆమె.

"అరే ! చివరికి వచ్చాడన్న మాట. పాపం టూ లేట్. ఆ మాట అతడితో చెప్దాం— పదండి" అంటూ రామయ్యగారు లేచారు.

మేడమీది బృందం అంతా మెట్లు దిగి కిందకి వచ్చారు.

"దొంగా, నా కంతా తెలిసిపోయిందిలే" అన్నారు రామయ్యగారు సరళతో— ఎవరూ వినకుండా, తోవలో.

సరళ నవ్వుతూ సిగ్గుతో తల దించుకొన్నది.

"నీకు గాని మీ కుటుంబంలో ఎవరికైనా గాని క్షయ, కేన్సరు, ఉన్మాదం— మొదలైన రోగాలు ఏవైనా కొన్నిగాని, అన్నీగాని ఎప్పుడైనా వచ్చాయా ?" అంటూ చావిట్లోంచి వినబడింది.

మూర్తి హడలి పోయాడు. ఆ కంఠస్వరం ఎవరిదో అతడికి తెలుసును. తిరిగి మేడ మీదికి పారిపోదా మనుకొన్నాడు. కాని తన వెనక సరళ, ఆమె తల్లి కూడా "సింగిల్ ఫైల్"లో వస్తూండడం మూలాన్న అది సాధ్య పడలేదు. అందరితో బాటు మూర్తి కూడా చావిట్లోకి రాక తప్పింది కాదు.

"హల్లో భీమారావ్ ! నేను ఇక్కడికి రావడం నువ్వు చూశావన్న మాట" అని మూర్తే తెగించి ముందు పలకరించాడు.

"ఎవరది— మూర్తి ! ఎప్పుడు వచ్చావ్ ? నువ్వు రావడం నేను చూడలేదే. నేను ఇక్కడికి రావడానికి కారణం కేవలం వైవాహికం. వీరి అమ్మాయిని చూడడానికి వచ్చాను. వీరే రామయ్యగారనుకొంటాను— నమస్కారం, ముందు చేతిలో పని పూర్తి చేద్దాం. ఈ ప్రపోజలు పైన సాక్షి సంతకం చెయ్యండి" అన్నాడు భీమారావు, రామయ్యగారి చేతికి కాగితం అందిస్తూ.

"భీమారావంటే నువ్వే అనుకొంటాను. నమస్కారం. నేనే రామయ్యని. ఈమె నా కుమార్తె సరళ— ఇప్పుడు పెళ్లి కావలసింది ఈమెకే. ఈమె నా భార్య, పేరు సీతా—"

"నా పేరు సీతమ్మ" అన్నది ఆమె ఖచ్చితంగా

"నమస్కారం. ఒక్క క్షణం క్షమించండి. రామయ్యగారూ ! మీ చేతిలో ఉన్న కాగితం వెంకయ్య తన జీవితం వెయ్యి రూపాయలకి భీమా చేస్తున్న దరఖాస్తు ఫారం. నేను వచ్చేసరికి మీరెవరితోనో మాట్లాడుతున్నారని ఇతడు చెప్పాడు. మీరు వచ్చేవరకు కాలం వ్యర్థం చెయ్యడం ఎందుకని ఈ వెంకయ్యకి జీవిత భీమా గురించి చెప్పాను. అతడిని ఒప్పించాను. ఇదిగో ఇక్కడ సంతకం చెయ్యండి— అంతే" అంటూ భీమారావు కాగితాన్ని తన వేలెట్‌లో భద్ర పరిచాడు.

"నువ్వు చాలా ఘటికుడివి. ఎక్కడకి వెళ్లినా బిజినెస్ సంపాదిస్తావు" అన్నాడు మూర్తి.

"ఏం చెయ్యమంటావు చెప్పు. ఇదంతా మా ఏజంట్లు చెయ్యవలసిన పని. వాళ్ళు ఇళ్లు కదలరు. బిజినెస్ కావడం లేదని పై నుండి మా డివిజనల్ మేనేజరు నన్ను దంచుతాడు. అందుచాత దరఖాస్తు ఫారాలు కూడా నేనే నింపించ వలసి వస్తున్నది" అన్నాడు భీమారావు.




"జీవితంమీద విరక్తిపుట్టి ఆ కరెంటు తీగలు ముట్టుకొని చద్దామనుకున్నారా! తీరా వెళ్తే అక్కడ కరెంటు తీగలు ముట్టుకొంటే శిక్షిస్తారని రాసుంది."

"రెండు ఘంటలు కాకుండా మా ఇంటి రమ్మని మీ నాన్నగారు నీకు వ్రాయలేదా ఇంత ఆలస్యంగా వచ్చావేం ?" అన్నారు రామయ గారు.

"వ్రాశారండి. అలాగే వస్తున్నాను కూడా ఈ లోగా తెలిసిన ముఖం ఒకటి ఎదురైంది అతడు ఒక అయిదు వేల రూపాయలకి ప్రపోజల ఇచ్చాడు. దానితో ఆలస్యం అయిపోయింది.' అన్నాడు భీమారావు.

"నువ్వు రాలేదని ఈ మూర్తికి మా అమ్మా యిని ఇచ్చి వివాహం చెయ్యాలని ఈలోగా మేమ నిశ్చయించాం" అని చెప్పారు రామయ్యగారు.

"ఓ ఇకనేం ! చాలా సంతోషం. నా ముఖ స్నేహితుడు మూర్తి అయితేనేం—నే నయితేనేం?' అంటూ భీమారావు మూర్తి వైపు తిరిగాడు "ఇవ్వాళ ఇంటర్వ్యూలో అసిస్టెంటు లెక్చరర్‌గ సెలక్టయ్యావట కదూ—రెండు శుభవార్తలకి చాల సంతోషం" అన్నాడు భీమారావు.

"అప్పుడే నీకెలా తెలిసింది ?" అని అడిగాడ మూర్తి ఆశ్చర్యంగా.

"మాకు ఇటువంటి విషయాలు ఎప్పటి కప్పుడు తెలుస్తూనే ఉంటాయి. మీ ఉద్యోగాల పైన ఆధారపడి ఉంటాయి మా ఉద్యోగాలు. అన్నట్టు ఈమెను ఇదివరకు ఎక్కడో చూసి నట్టున్నదే" అంటూ భీమారావు సరళ వైపు తిరిగాడు.

"మనం బి. య్యే చదువుతున్నప్పుడు ఈమె పి. యు. సి. చదివేది" అని మూర్తి "భీమారావు నీకు గుర్తు ఉన్నాడా ?" అని సరళని ప్రశ్నించాడు.

"నాకు జ్ఞాపకంలేదు" అన్నది సరళ.

"అవును. అప్పటి భీమారావుకి ఇప్పటి భీమారావుకి చాలా వ్యత్యాసం ఉన్నది. అప్పటి భీమారావు ఎవరికి జ్ఞాపకం ఉండదు. అప్పుడు మేక. ఇప్పుడు పెద్ద పులి అయిపోయాడు" అన్నాడు మూర్తి నవ్వుతూ.

"ఈ శుభ సమయాన సంతోషంగా ఉందా మంటే నా మనస్సులో ఒక్క వెలితి మాత్రం బాధిస్తున్నది" అన్నాడు భీమారావు.

"ఏమిటది ?" అన్నాడు మూర్తి, రామయ్య గారు, ఏక కంఠంతో.

"మూర్తి ఇంతవరకు భీమా చెయ్యకుండా తప్పించుకొంటున్నాడు. ఈ రోజున ఇతడికి ఉద్యోగం, వివాహం కూడా స్థిరపడ్డాయి. ఇతడి పేర పది వేల రూపాయలకి ఒక్క ప్రపోజలు ఇచ్చాడా"

"ఏమిటీ ? పదివేల రూపాయలే ? అంత ప్రీమియం నేను చెల్లించ గలనా " అన్నాడు మూర్తి.

"పదివేలేమిటోయ్ వెర్రివాడా, పాతికవేల రూపాయలకి ప్రపోజలు వ్రాయి. ప్రీమియాలు కట్టడానికి సరిపోయేటంత వడ్డీ వచ్చే సొమ్ము నేను అమ్మాయి పేర ఫిక్సెడ్ డిపోజిట్ చేస్తాను. మంచి ముహూర్తం చూచి మీ ఫ్రెండు చాత దరఖాస్తు ఫారం నింపించు. పాలసీ మాత్రం పెళ్లి నాటికి వచ్చేటట్టు ఏర్పాటు చెయ్యి. ఇప్పుడు కట్నాలు ఇవ్వకూడదు కదూ. పెళ్లి పీటలపైన ఇతడికి ఆ పాలసీనే బహూకరిస్తాను" అన్నారు రామయ్యగారు నవ్వుతూ. ★